

కోరుట్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సంజయ్‌ను ఆశీర్వదిస్తున్న వేద పండితులు

## కోరుట్ల ఎమ్మెల్యేకు వేదపండితుల ఆశీర్వచనం

- ఎమ్మెల్యే హోదాలో మొట్టమొదటిసారి క్యాంపు కార్యాలయానికి
- డాక్టర్ సంజయ్ కల్వకుంట్లకు ఘన స్వాగతం పలికిన బీఆర్ఎస్ శ్రేణులు

కోరుట్ల, డిసెంబర్ 13: కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్లకు బీఆర్ఎస్ శ్రేణులు బుధవారం ఘన స్వాగతం పలికారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ఎమ్మెల్యే హోదాలో మొదటిసారిగా వచ్చిన సందర్భంగా వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. బీఆర్ఎస్ శ్రేణులు పుష్పగుచ్ఛం అందించి అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం స్వీట్లు అందజేసి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా వైద్యాధికారి పుప్పాల శ్రీధర్, జిల్లా విద్యాధికారి జగన్‌మోహన్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు సంజయ్‌కి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు పాలెపు రామకృష్ణశర్మ, బీర్నంది లక్ష్మీ నరసింహచార్యులు, ప్రవీణ్‌కుమారచార్యులు, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్, ప్రధాన కార్యదర్శి గుడ్ల మనోహర్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## యువతే దేశానికి వెన్నెముక



మాట్లాడుతున్న కమాండింగ్ ఆఫీసర్ డానియల్

హుజూరాబాద్ రూరల్, డిసెంబర్ 13: క్రమశిక్షణ కలిగిన యువత దేశానికి వెన్నెముక లాంటి వారని తెలంగాణ నైన్ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ డానియల్ పేర్కొన్నారు. మండలంలోని సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో నేషనల్ కెడేట్ క్రాప్స్ (ఎన్‌సీసీ) అన్యువల్ ట్రైనింగ్ క్యాంప్ ప్రారంభోత్సవం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డానియల్ మాట్లాడారు. ఎన్‌సీసీతో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని చెప్పారు. డిసెంబర్ 12 నుంచి డిసెంబర్ 21 వరకు ఈ శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, సంగారెడ్డి నుంచి దాదాపు 350 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. పది రోజులపాటు ఎన్‌సీసీ సిలబస్ ప్రకారం మ్యాప్ రీడింగ్ క్రాఫ్ట్, డ్రిల్, వివిధ శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. సుబేదార్ మేజర్ సాగర్ సింగ్ ఆధ్వర్యంలో ఆరుగురు ఎన్‌సీసీ అధికారులు, 14 మంది శిక్షకులు కెడేట్లకుకు శిక్షణ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో క్యాంపు కమాండెంట్ కల్నల్ డానియల్ లార్జెన్, డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ కెప్టెన్ డాక్టర్ రవీంద్రబాబు, సుబేదార్ మేజర్ సాగర్ సింగ్, అసోసియేట్ ఎన్‌సీసీ అధికారులు శ్రీలత, మహేందర్ రెడ్డి, శ్రీనివాస్, ప్రశాంత్, మంగమ్మ, తదితరులు ఉన్నారు.



హాజరైన ఎన్‌సీసీ క్యాడెట్లు

## పోగొట్టుకున్న బంగారు గొలుసు అప్పగింత

వేములవాడ టౌన్, డిసెంబర్ 13: ఓ భక్తురాలి బంగారు గొలుసు ఆలయ పరిసరాల్లో పడిపోయంది. వెంటనే స్పందించిన పోలీసులు వెతికి తిరిగి బాధితురాలికి అందించారు. దీంతో రాజన్న ఆలయ ఎస్పీఎఫ్ పోలీసులను పలువురు అభినందించారు. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్‌కు చెందిన బుర్ర శంకర్‌గౌడ్ దంపతులు బుధవారం రాజన్న దర్శనార్థం వచ్చారు. ఈ క్రమంలో భక్తురాలి 4 తులాల బంగారు పుస్తెలతాడు ఆలయ ప్రాంగణంలో పడిపోయింది. వెంటనే డ్యూటీలో ఉన్న ఎస్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ కుమారస్వామి, కానిస్టేబుల్ రవికి వారు సమాచారం ఇచ్చారు. స్పందించిన పోలీసులు పోయిన గొలుసును వెతికి తీసుకొచ్చారు. ఆలయ పర్యవేక్షకుడు తిరుపతిరావు చేతులమీదుగా బంగారు గొలుసును బాధితురాలికి అందజేశారు. దీంతో బాధితురాలి కుటుంబసభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానికులు పోలీసులను అభినందించారు.

# పెద్దపల్లి జిల్లాలో 'లంచ్ అండ్ లెర్న్'

- శ్రీకారం చుట్టిన కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్
- రంగంపల్లి మైనార్టీ బాలికల స్కూల్‌లో ప్రారంభం
- ప్రతి బుధవారం కార్యక్రమం
- నాణ్యమైన బోధన, భోజనమే లక్ష్యం



విద్యార్థినులతో మాట్లాడుతున్న పెద్దపల్లి కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

పెద్దపల్లి, డిసెంబర్ 13: సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనం. బోధన అందించే లక్ష్యంతో పెద్దపల్లి కలెక్టర్ జిల్లాలో 'లంచ్ అండ్ లెర్న్' పేరిట వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బుధవారం పెద్దపల్లి మండలం రంగంపల్లిలోని తెలంగాణ మైనార్టీస్ బాలికల గురుకుల స్కూల్‌లో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. వారితో ఆప్యాయంగా ముచ్చటించారు. బోధనా విధానం, భోజనంలో నాణ్యతపై ఆరా తీశారు. ఆసక్తికలిగిన విషయాలు, సబ్జెక్టులు, ఇష్టమైన క్రీడలు తదితర అంశాలను అడిగితెలుసుకున్నారు. మన దేశానికే గర్వకారణంగా నిలిచిన చంద్రయాన్– 3 ప్రాజెక్టులో పాల్గొన్న శాస్త్రవేత్తలు ప్రభుత్వ పాఠశాలలో చదివారని తెలిపారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లాలని ఉద్బోధించారు. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ విజయం దిశగా సాగాలన్నారు. మానసిక ప్రశాంతత కోసం మెడిటేషన్, యోగా చేయాలన్నారు. ప్రతి రోజూ కొంత సమయాన్ని క్రీడలకు కేటాయించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేందుకు లంచ్ అండ్ లెర్న్ కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు. ఇక నుంచి ప్రతి బుధవారం జిల్లా అధికారులు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి, తనిఖీ చేసి పాఠశాలలో విద్యార్థులకు అందితున్న సౌకర్యాలు, సమస్యలు, బోధన, భోజనం తదితర అంశాలపై సమగ్ర నివేదిక సమర్పిస్తారని చెప్పారు. ప్రతి విద్యార్థిపై ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చిస్తున్న విషయాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలన్నారు. ప్రభుత్వం సూచించిన ఫుడ్ మెనూను ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో తప్పకుండా అమలు అయ్యే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించి, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి విద్యార్థిని ప్రగతి నెల వారీగా సమీక్షించాలని, పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు.

# ప్రత్యామ్నాయ సాగుపై రైతుల్లో చర్చ జరగాలి

- రైతులకు లాభదాయక పంటల సాగు దిశగా అడుగులు వేయాలి
- ఆయిల్ పామ్ సాగుకు ప్రతి ఎకరానికీ 4,200 సబ్సిడీ అందజేత
- కూరగాయలు, పండ్ల సాగు, సెరికల్చర్ దిశగా రైతులు ఆలోచించాలి
- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్
- రాఘవాపూర్ రైతు వేదికలో అవగాహన

పెద్దపల్లి కమాన్, డిసెంబర్ 13: ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా రైతుల్లో చర్చ జరగాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం పెద్దపల్లి మండలంలోని రాఘవాపూర్ గ్రామంలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతు వెంకటేశ్వర్‌రావు పొలాన్ని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో సందర్శించారు. రైతు వెంకటేశ్వర్‌రావు తనకున్న ఐదు ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నానని, ప్రభుత్వం నుంచి సబ్సిడీ కింద ₹21వే లు బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయని రైతు తెలిపారు. అనంతరం రాఘవాపూర్ రైతువేదికలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ పాల్గొని మాట్లాడారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు ది శగా చర్చించి మంచి నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రభు త్వం వివిధ పంటలకు అందించే ప్రోత్సాహకాలను, మా ర్కెట్లో వాటికి ఉన్న డిమాండ్ తదితర అంశాలపై అధికారులు అవగాహన కల్పిస్తారని, చివరికి రైతు మాత్రమే దా నిపై నిర్ణయం తీసుకుని చర్య తీసుకోవాల్సి ఉంటుందన్నారు. తమలో తాము చర్చించుకుని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రస్తుతం దేశంలోని అనేక రాష్ట్రాల్లో వరి ధాన్యం అధికంగా పండుతుందని, మార్కెట్‌లో అవసరానికి మించి అదనంగా ధాన్యం దిగుబడి ఉన్నందున డిమాండ్, ఆదాయం పడిపోతుందని వివరించారు. వరికి ప్రత్యామ్నాయంగా లాభదాయక పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు. మన దేశంలో వినియోగించే వంట నూనె ఇతర దేశాల నుంచి దిగుబడి చేసుకుంటున్నామని, ఆయిల్ పామ్ సాగుతో పాటు మొదటి మూ డేండ్ల పాటు అంతర్ పంటల సాగు వల్ల రైతులు ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. 4వ సంవత్సరం నుంచి ఎకరానికి అధిక ఆదాయం వస్తుందన్నారు. ఆయి ల్ పామ్ మొక్కను మూడు నుంచి నాలుగేండ్లు కాపాడుకుంటే 30 ఏండ్ల పాటు మన కుటుంబానికి జీవనోపాధి కల్పిస్తూ ఆయిల్ పామ్ సాగు తోడ్పాటునిస్తుందని తెలిపారు. కోతుల బెడద, ఇతర జంతువుల నుంచి ఎలాంటి నష్టం ఉండదన్నారు. ఆయిల్ పామ్ సాగుకు ₹213 విలువ గల మొక్కను ప్రభుత్వం ₹193 సబ్సిడీతో కేవ లం ₹20కే అందిస్తుందన్నారు. అంతేకాకుండా ప్రతి స ంవత్సరం ఎకరానికి ₹4200 చొప్పున నాలుగు సంవత్సరాలు ₹16800 అంతర్ పంటకు సబ్సిడీ అందిస్తామన్నారు. రైతులు తమకు ఉన్న భూ విస్తీర్ణంలో కొంత మేర భూమిని ఆయిల్ పామ్, కూరగాయలు, పండ్లు, సెరికల్చర్ మొదలగు ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా ఆలోచించాలని, రైతులకు అవసరమైన అన్ని రకాల సహా య, సహకారాలు, సలహాలు అందించేందుకు రైతు వేదికలు, ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. రైతులు పండించే ఆయిల్ పామ్‌ను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేస్తుందని, రైతులకు అధిక లాభం కల్పించే దిశగా అవసరమైన కార్యాచరణను అమలు చేస్తున్నామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల కింద ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించేందుకు రైతులకు అందించే ప్రోత్సాహకాలను అధికారులు వివరిస్తారని, ఆధునిక సాగు పద్ధతులను రైతులకు అందించేదుకు నిర్మించిన రైతు వేదికలను సంపూర్ణంగా వినియోగించుకోవాలని, నూతన సాగు పద్ధతులపై నిరంతరం అవగాహన కార్యక్రమాలను అధికారులకు కలెక్టర్ సూచించారు. వ్యవసాయంలో రసాయన ఎరువుల వినియోగం వీలైనంత వరకు తగ్గించాలని, వాటి వల్ల భూసారం తగ్గుతుందన్నారు. కాలుష్యం పెరుగుతుందన్నారు. రైతులు సేంద్రియ ఎరువులతో వ్యవసాయం చేసే విధానాన్ని అలవర్చుకోవాలని, దీనిపై అధికారులు అవగాహన కల్పించాలన్నారు. రాఘువాపూర్ గ్రామంలో నూతన సాగు పద్ధతులు అవలంభిస్తున్న రైతులు మల్లారెడ్డి, వెంకటేశ్వర్‌రావును కలెక్టర్ సన్మానించారు. అనంతరం ఎఫ్‌పీవోల ఏర్పాటుకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి, జిల్లా హార్టికల్చర్ అధికారి జగన్‌మోహన్‌రెడ్డి, వ్యవసాయ అధికారి అలివేణి, వ్యవసాయ విస్తరణాధికారులు స్పందన, శిరీష, సువర్ణ, శ్వేత, కల్పన, ఫినోలెక్స్ కంపెనీ ప్రతినిధులు, రైతు మల్లారెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ఆయిల్‌పామ్ పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్




రైతు వెంకటేశ్వర్‌రావును సన్మానిస్తున్న కలెక్టర్